## క్లుప్తంగా

### ఘనంగా ఆంజనేయ స్వామివారి ఊరేగింపు



వెలగదుర్రులో ఆంజనేయస్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

**ఉండ్రాజవరం:** హనుమజ్జయంతిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని వెలగదుర్రు గ్రామంలో స్వామివారిని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భజంత్రీల వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఆంజనేయ స్వామి వారి ఊరేగింపు క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఉండ్రాజవరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మూడో రోజైన సోమవారం వేద పండితులు ఆంజనేయ హోమం నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల్లో అన్నసమారాధనలు జరిగాయి.

**భారీ అన్న సమారాధన**

**నిడదవోలు:** హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్థానిక ఒకటో వార్డులోని అభయ ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ భోజనాలు వడ్డించి అన్నసమారాధనను ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, ఉండవల్లి నాగకేశవమూర్తి, పెంటపాటి నాగరాజు, దేవిశెట్టి చిరంజీవి, ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీలక్ష్మి మహాయజ్ఞానికి తరలి వెళ్లిన భక్తులు



నిడదవోలు నుంచి శ్రీలక్ష్మి మహాయజ్ఞానికి తరలి వెళుతున్న భక్తులు

**నిడదవోలు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ,ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞానికి నిడదవోలు నుంచి సోమవారం భక్తులు తరలి వెళ్లారు. కోటసత్తెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో ధర్మకర్తలమండలి సభ్యులతో పాటు భక్తులను తీసుకు వెళ్లినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

### కార్యాలయ భవన నిర్మాణాలు పూర్తిచేయాలి



రావిమెట్లలో ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

**నిడదవోలు రూరల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాలైన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను త్వరగా పూర్తిచేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. రావిమెట్ల గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నిర్మాణాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేలా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే ఆన్‌లైన్ చేయాలని పీఆర్ ఏఈ సీహెచ్ ఎస్ఆర్‌కే శాస్త్రికి సూచించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చిలుకూరి చిట్టిప్రసాద్, నాయకులు ఉప్పులూరి రామకృష్ణ, మిద్దే శ్రీను, తిరుమళ్ల దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వేళ్లచింతలగూడెంలో బడిబాట ర్యాలీ



బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**గోపాలపురం:** బడిఈడు పిల్లలను బడిలో చేరిఏంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సోమవారం మండలంలోని వేళ్లచింతలగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం ఎన్‌సీహెచ్ రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వేళ్లచింతలగూడెం సర్పంచ్ గోళ్ల కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సనమండ్ర కొండయ్య, పంచాయతీ కార్యదర్శి కె. సాంబమూర్తి, ఉపాధ్యాయులు సూర్యచంద్రం, హితయతుల్లా, సీఆర్‌పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

# వేసవి బడిగా గ్రంథాలయం

- పుస్తక పఠనంతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- జూన్ 16 వరకూ వేసవి శిక్షణ శిబిరం



నిడదవోలు శాఖా గ్రంథాలయంలో బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

**నిడదవోలు:** వేసవి సెలవుల్లో మెజారిటీ విద్యార్థులు బంధువుల ఇళ్లకు వెళ్లి ఎంజాయ్ చేస్తుంటే కొందరు విద్యార్థులు చదువు బాట పట్టారు. విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వగానే, విద్యార్థుల ఆనందానికి అవధులు ఉండవు. ఓ పక్క సెలవులను ఎంజాయ్ చేస్తూనే విజ్ఞానంతో పాటు వినోదాన్ని పొందుతున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో పుస్తకాలు చదివే పిల్లలు తగ్గిపోతున్నారు. కాస్త సమయం దొరికితే చాలు ఆండ్రాయిడ్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. కొందరు విద్యార్థులకైతే ఏకంగా ఇది వ్యసనంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు గ్రంథాలయ సంస్థ వేసవి ఉచిత విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసింది.

**నిడదవోలు పట్టణంలో..**

ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈనెల నెల 08 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించారు. జూన్ 16 వరకూ ఇవి కొనసాగుతాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు ఇక్కడ వివిధ అంశాలు నేర్పిస్తున్నారు. రోజూ విద్యార్థులతో గ్రంథాలయం కళకళలాడుతోంది. పట్టణంలోని వివిధ హైస్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలతో కాలక్షేపం చేస్తున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు ఒక చోట చేరి కొంత సేపు కబుర్లు చెప్పుకున్నా, తర్వాత తమకు ఇష్టమైన పుస్తకాలు తీసుకుని చదుకుంటున్నారు. వేసవి సెలవుల్లో విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించడంతో విద్యార్థులు ఇక్కడ అందుబాటులో ఉన్నా బాల సాహిత్యం, పురాణాలు, చరిత్ర, బాల వినోదిని, బాల భారతం, భారత రాజ్యాంగం, హక్కులు, వినియోగదారుల హక్కులు, ఇంగ్లిష్ సాహిత్యం, భారత స్వాతంత్ర్య సమయోధుల పుస్తకాలతో పాటు జూన్‌లో తాము ప్రవేశించబోయే తరగతుల పాఠ్యా పుస్తకాలు చదువుతూ తమ విజ్ఞానాన్ని మరింతగా మెరుగు పరుచుకుంటున్నారు. ప్రధానంగా స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక పఠనం, డ్రాయింగ్ వేయడంలో శిక్షణ ఇస్తున్నారు. ఆరో తరగతి నుంచి 10 వ తరగతి వరకూ విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

**సృజనాత్మకత పెరుగుతోంది**



విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ తరగతుల వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతోంది. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవడం ద్వారా ఇంగ్లిష్ అంటే భయం పోతుంది. విద్యార్థులు సొంతంగా ఆలోచిస్తారు. ఇప్పటి నుంచే పోటీ పరీక్షల్లో గెలవాలనే ఆలోచనలో ఉంటారు. ఇక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు వారికి జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు కూడా ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు.

– కుంచె చినబాబు, గ్రంథాలయాధికారి

## కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన



దేవరపల్లిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి తదితరులు

**దేవరపల్లి:** స్థానిక ప్రభుత్వ బాలుర వసతిగృహం వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. పాత కల్వర్టు వరదలకు కుంగిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆ స్థానంలో కొత్త కల్వర్టు నిర్మాణానికి గడప గడపకూ నిధులు రూ.4.50 లక్షలు, డ్రైన్ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేశారు. కల్వర్టు నిర్మాణం పూర్తికాగా, ఇరువైపులా అప్రోచ్‌ల నిర్మాణం, గోడ నిర్మాణం, కల్వర్టు అడుగున పూడికతీతకు నిధులు సరిపోనందున పంచాయతీ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి తెలిపారు. కార్యక్రమంలో దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అందరి అంగీకారంతోనే పరిహారం

**దేవరపల్లి:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలోని రైతుల అంగీకారంతో వడగళ్ల వానకు పొగాకు పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం ఇవ్వడానికి నిర్ణయించామని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. గత నెలలో జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల పరిధిలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వాన వల్ల పొగాకు తోటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. దీనిపై ఐదు వేలం కేంద్రాల పరిధిలోని రైతులు సమావేశాలు నిర్వహించి నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి తమ వంతు సాయం అందించడానికి తీర్మానం చేశారు. ఒక్కొక్క రైతు రూ.200 చొప్పున ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఈ సొమ్మును పొగాకు అమ్మకాల నుంచి తీసి బోర్డు ద్వారా నష్టపోయిన రైతులకు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు దేవరపల్లి వేలం కేంద్రంలోని రైతులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసి వేలం కేంద్రం అధికారి జీఎల్‌కే ప్రసాద్‌కు అందజేశారు. దీనిలో బలవంతం లేదని, ఇవ్వడానికి ఇష్టంలేని వారు ముందుగా చెపితే వారి అమ్మకాల నుంచి తగ్గించమని వేలం నిర్వహణాధికారి రైతులకు తెలిపారు. కాగా ఈ నెల 13న ఒక దినపత్రికలో పొగాకు బోర్డులో అసమ్మతి సెగలు అనే శీర్షికన వచ్చిన కథనాన్ని రైతు సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆపదలో ఉన్న రైతులను రైతు సంఘం స్వచ్ఛంగా ఆదుకోవడంతో తప్పేంటని వారు ప్రశ్నించారు. రూ.200 ఇవ్వడానికి ఇప్పడైనా ఇష్టంలేని రైతులు వేలం కేంద్రం అధికారిని లిఖిత పూర్వకంగా అభ్యంతరం చెపితే అమ్మకాల నుంచి మినహాయింపు ఉండదని ఆచంట గోపాలకృష్ణ, కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయంలో బోర్డు అధికారుల ప్రమేయం లేదని వారు చెప్పారు.

## ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా అనంతపల్లిలో ర్యాలీ



అనంతపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు బృందం

**నల్లజర్ల:** పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని అటవీ శాఖ డీఆర్వో చెల్లా శ్రీనివాసరావు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి జూలై 5 వరకూ జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం అనంతపల్లిలో ఆ పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారుల వెంబడి ఉన్న ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం ఒక పక్క సంపూర్ణ ప్లాస్టిక్ నివారణ, మరో పక్క నీరు, విద్యుత్తు ఆదా ఎలా పాటించాలనే విషయాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసే దిశగా కార్యక్రమాలు రూపొందించినట్టు వివరించారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వం కృత నిర్చయంతో పని చేస్తోందన్నారు. ప్రజలు, వ్యాపారులు ఇకపై గుడ్డ, జనపనార సంచులను వినియోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలందరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపల్లి సర్పంచ్ వెంగల కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ,కార్యదర్శి విజయకుమార్, సభ్యులు బళ్ళ నాని, నాయకులు ర్యాలీ వెంకటస్వామి, కూరగాయల శ్రీను, యడ్లపల్లి మంగయ్య, వెంగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 16.86 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు

**దేవరపల్లి:** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో సోమవారం నాటికి 16.86 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య తెలిపారు. ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన పొగాకు విలువ సుమారు రూ.332 కోట్లు ఉంటుందన్నారు. కిలో గరిష్ట ధర రూ.210, కనిష్ట ధర రూ.170, సగటు ధర రూ.197.20 పలికింది. పండుగుల్ల పొగాకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఐదు వేలం కేంద్రాల్లో సుమారు 75 వేల కిలోల లో గ్రేడు పొగాకు విక్రయాలు జరిగాయన్నారు. లోగ్రేడు పొగాకుకు మంచి ధర లభించిందన్నారు. దాదాపు లోగ్రేడు పొగాకు విక్రయాలు పూర్తయినట్టు చెప్పారు. బ్రైట్ పొగాకు అమ్మకాలు జరగాల్సి ఉందన్నారు. 1,45,163 బేళ్ల అమ్మకం జరిగినట్టు చెప్పారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 3.11 మిలియన్ల కిలోలు, జంగారెడ్డిగూడెం–1 కేంద్రంలో 3.69 మిలియన్ల కిలోలు, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 3.09 మిలియన్ల కిలోలు, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 3.90 మిలియన్ల కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 3.06 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు ఆదిశేషయ్య వివరించారు.

### వీధి బాలలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తోట శ్రీనివాసరావు

**కొవ్వూరు:** పట్టణంలోని మదర్ థెరిసా వీధిబాలల సంరక్షణ కేంద్రంలోని బాలలకు సోమవారం మండలంలోని పెనకనమెట్ట గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు దుప్పట్లు పంపిణీ చేశారు. తన మనవడు చైతు సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు తోట శ్రీనివాసరావు భోజన వసతి కల్పించడంతో పాటు స్వీట్లు పంచారు. దొమ్మేరు, కొవ్వూరు మహాత్మాగాంధీ బట్టల వర్తక సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, కోరంగి మణికంత పాల్గొన్నారు.

### 20 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు

**పెరవలి:** మండలంలోని అన్నవరప్పాడు వద్ద జాతీయ రహదారి పక్కనే సారా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పెరవలి ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. వారి వద్ద నుంచి 20 లీటర్ల సారా, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

**కొవ్వూరు:** సారా కేసుల్లో పాత ముద్దాయి అయిన సీతా అశోక్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోమవారం తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందుతుడు మద్దూరు గ్రామానికి చెందిన వాడన్నారు.

## ‘మానవత’ భవనాలకు స్థలాలు ఇప్పించండి

**కలెక్టర్ మాధవీలతను కోరిన సభ్యులు**



కలెక్టర్ మాధవీలతకు మానవత సంస్థ డైరీ అందిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

**దేవరపల్లి:** మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయ భవనాల నిర్మాణానికి వీలుగా దేవరపల్లి, నల్లజర్ల, తాళ్లపూడిలలో ప్రభుత్వం స్థలాలను మంజూరు చేయాలని కోరారు. ఆ సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డైరెక్టర్ బలుసు సత్యనారాయణ, ఆయా మండలాల ప్రతినిధులు సోమవారం రాజమహేంద్రవరం వెళ్లి జిల్లా కలెక్టర్ కె.మాధవీలతను కలిసి, ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మానవత సంస్థ డైరీని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మానవత సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటోందన్నారు. సంస్థకు దాతలు సమకూర్చిన ఫ్రీజర్లు, శాంతి రథాలను భద్రపరుచుకొనేందుకు భవనాలు లేక ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. భవనాల నిర్మాణానికి వీలుగా ఈ మూడు మండల కేంద్రాల్లో స్థలాలు మంజూరు చేయాలని కోరారు. స్థలాల కేటాయింపునకు ఆమె సుముఖత వ్యక్తం చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మానవత సంస్థ నల్లజర్ల మండల చైర్మన్ బోగవల్లి వెంకటసుబ్బారావు, అధ్యక్షులు జి.వెంకటరత్నం, బోర్డు డైరెక్టర్ ఆలపాటి లక్ష్మీనారాయణ, తాళ్లపూడి మండల అధ్యక్షులు బోడాల వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తత అవసరం





ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

**నిడదవోలు:** డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, పట్టణ పారిశుధ్య పరిశీలకులు సీహెచ్ ఉదయ్‌కుమార్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, వార్డు శానిటరీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**డెంగీపై పుల్లలపాడు వాసులకు అవగాహన**

**నల్లజర్ల:** ప్రజల భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామంటూ నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం పుల్లలపాడులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుల్లలపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముగిశాక డెంగీపై ఆ గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు డాక్టర్ తెల్లం గంగాధరరావు తెలిపారు. డెంగీ వ్యాధి నిర్ధారణకు వైద్య పరీక్షలే కీలకమన్నారు. ఈ వ్యాధి రావడానికి ఏడిస్ దోమే కారణమన్నారు. ఇంటి పరిసరాల్లో నీటికుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. అవసరం అయితే దోమ తెరలను వాడాలని సూచించారు.

## ఈ సీమ సుభిక్షం కాటన్‌దొర చలవే

- ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి
- ఘనంగా అపర భగీరథుని జయంతి



నిడదవోలులో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈఈ దక్షిణామూర్తి, సిబ్బంది

**నిడదవోలు:** నీరందక పంటలు ఎండిపోతున్న తరుణంలో సర్ ఆర్థర్ కాటన్ అకుంఠిత దీక్షతో ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై బ్యారేజీ నిర్మించి పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేశారని నీటిపారుదల శాఖ నిడదవోలు ఈఈ ఎం.దక్షిణామూర్తి అన్నారు. పట్టణంలోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయం ఆవరణలో సోమవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దక్షిణామూర్తితో పాటు గోదావరి డివిజన్ సిబ్బంది కార్యాలయ ఆవరణలోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి కె.నందీశ్వరుడు, పీవీ మాణిక్యాలరావు, బి.కిషోర్, కె. నాగేశ్వరరావు, ఎ.మోహన్, కె.రామసత్యనారాయణ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** సోమవారం కాటన్ జయంతి సందర్భంగా మండలంలోని కాల్దారి గ్రామంలోని ఆయన విగ్రహానికి కాల్దారి సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం పలువురు రైతులు పాల్గొన్నారు. అలాగే గోడిచర్లల్లో లాక్ సూపరింటెండెంట్ ఎం.విజయ్ కుమార్, లస్కర్లు కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### నేడు కొవ్వూరు నాలుగో వార్డులో గడప గడపకూ..

**కొవ్వూరు:** రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండలం పెనకనమెట్ట గ్రామంలో నిర్వహించే అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.40 గంటలకు నాలుగో వార్డులో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరవుతారు.

### ఎంపీని అరెస్టు చేయాలంటూ ఐఎఫ్‌టీయూ ధర్నా

**నిడదవోలు:** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్‌లకు న్యాయం చేయాలని, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిచ్చెనకోళ్ళ సాయిబాబా, బత్తిన చంద్రశేఖర్, ఖండవల్లి వెంకట్రావు, నూతంగి రమేష్, మల్లిడి రామిరెడ్డి, గాలి గనిరాజు, అహ్మద్, పిల్లి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ‘దుగ్గిన’కు ఎమ్మెల్యే తలారి పరామర్శ

**దేవరపల్లి:** వైఎస్సార్ సీపీ దేవరపల్లి శాఖ అధ్యక్షులు దుగ్గిన గంగాధర్ తండ్రి గంగరాజు ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గంగరాజును సోమవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు పరామర్శించారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అడబాల సుబ్బాయమ్మ కటుంబ సభ్యులను వారు పరామర్శించారు.

### మాజీ సర్పంచ్‌కి మంత్రి పరామర్శ



ఆంజనేయులు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి తానేటి వనిత

**కొవ్వూరు:** సీతంపేట మాజీ సర్పంచ్ కంబాల రాముడు, నాగమణి దంపతులను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రాముడు కుమారుడు ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందారు.ఈ క్రమంలో ఆంజనేయుడు చిత్ర పటానికి మంత్రి వనిత పూలు వేసి నివాళులు ఆర్పించారు. రాముడు కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు దేవన సత్యనారాయణ, వస్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి అంత్యకాల ఉజ్జీవ సువార్త సభలు

**నిడదవోలు రూరల్:** మండలంలోని సమిశ్రగూడెంలో ఈనెల 16, 17 తేదీల్లో అంత్యకాల ఉజ్జీవ సువార్త సభలు నిర్వహిస్తున్నట్టు బ్రదర్ హిజ్కియా సోమవారం తెలిపారు. దైవజనులు ఆర్ లాజరస్, సువార్త గాయకుడు బ్రదర్ కిషోర్‌లు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

### ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలన

**నిడదవోలు రూరల్:** రబీలో పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తహసీల్దార్ ఎం.గంగరాజు తెలిపారు. నిడదవోలు, సమిశ్రగూడెం, తిమ్మరాజుపాలెం రైస్‌మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను తహసీల్దార్ గంగరాజు సోమవారం పరిశీలించారు. తేమ, నూక శాతం వంటి కారణాలతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

### పెళ్లి వేడుకలో ఇరువర్గాల ఘర్షణ

**సీతానగరం:** మండలంలోని పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో సోమవారం జరిగిన పెళ్లి వేడుకలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి, పలువురికి గాయాలయ్యాయి. రామచంద్రపురానికి చెందిన జిత్తుగ సుబ్రహ్మణ్యం (సుబ్బారావు)కు, తాళ్లపూడి మండలం గజ్జరానికి చెందిన శ్రీపూజితతో రామచంద్రపురంలో వివాహమైంది. ఈ నేపథ్యంలో పెళ్లికుమార్తెను డ్యాన్స్ చేయమని పెళ్లికొడుకు బంధువులు ఒత్తిడి చేయడంతో, పెళ్లికుమార్తె అన్నయ్య తిరస్కరించాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి దాడులకు దిగారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ, సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి.. ఇరువర్గాలతో మాట్లాడి సఖ్యత కుదిర్చారు. అప్పటికే గాయాలైనవారు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై ఇరువర్గాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

### టీడీపీ శ్రేణుల పాదయాత్ర

**నిడదవోలు రూరల్:** తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా టీడీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని డి.ముప్పవరం నుంచి సమిశ్రగూడెం మీదుగా నిడదవోలు వరకూ ఈ పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దొమ్మేరు నుంచి కొవ్వూరు వరకూ..**

**కొవ్వూరు:** టీడీపీ నియోకజవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. దొమ్మేరు నుంచి కొవ్వూరు పట్టణంలోని విజయ విహార్ సెంటర్ వరకూ ఈ పాదయాత్ర జరిగింది. టీడీపీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పెనుమాక జయరాజు,మరపట్ల కళాధర చక్రవర్తి, పార్టీ మండలశాఖ అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేశ్వరరావు, నాదెండ్ల శ్రీరామ్ చౌదరి, నాయకులు పాల్గొన్నారు.